

2021 నవంబరు 19న అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంతో గ్రామాల్లో ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)



అన్నమయ్యా..!





అలంకారప్రాయంగా మారిన అన్నమయ్య ప్రాజెక్టు

- నాలుగేళ్లయినా మమ్మల్ని పట్టించుకోరా...?
- ప్రభుత్వాలు మారినా మా బతుకులు మారవా...
- అన్నమయ్య ప్రాజెక్టు బాధితుల గోడు వినేదెవరు...?
- ప్రాజెక్టు తెగిపోయి నేటికి నాలుగేళ్లు
- ప్రాజెక్టును పునర్నిర్మించి సదుపాయాలు కల్పించాలని బాధితుల వేడుకోలు

ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ మా బతుకులు మాత్రం మారడం లేదు... పాలకులు, అధికారులు హామీలు ఇస్తున్నారే తప్ప మా గురించి పట్టించుకోవడం లేదని అన్నమయ్య ప్రాజెక్టు బాధితులు వాపోతున్నారు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి నీరంతా ఊర్లపై పడి భారీగా ప్రాణ, ఆస్తినష్టం జరిగి ఇప్పటికి నాలుగేళ్లయినా పాలకులు ఇచ్చిన హామీలు మాత్రం ఒక్కటీ నెరవేరలేదు. ఇళ్లు లేవు.. పొలాలు లేవు... ఉపాధి లేదు... ఒకప్పుడు దర్జాగా బతికిన మేము ఇప్పుడు కూలి పనులు చేసుకుని బతకాల్సి వస్తోంది. ఇప్పటికైనా పాలకులు మా బాధను అర్థం చేసుకుని మమ్మల్ని ఆదుకోవాలని అన్నమయ్య ప్రాజెక్టు బాధితులు వేడుకుంటున్నారు.

రాజంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య ప్రాజెక్టు దుర్ఘటన జరిగిన నేటికి సరిగ్గా నాలుగేళ్లు. 2021 నవంబరు 19వ తేదీ తెల్లవారుజామున ప్రాజెక్టు కట్ట తెగిపోయి నీరంతా ఊర్లపై ఊర్లను ఏరుగా మార్చేసింది. ఈ దుర్ఘటన జరిగి నాలుగేళ్లయినా బాధితులకు ఏమాత్రం న్యాయం జరగలేదు. నాటి వైసీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వందల హామీలు గుప్పించినా ఒక్కటీ కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు అవుతున్నా ఎటువంటి మార్పు లేదు. ప్రాజెక్టు కొట్టుకుపోయి ఒక్కసారిగా వచ్చిన వరదతో సుమారు 40 మందికి పైబడి చనిపోయినా, పది గ్రామాలు తుడిచిపెట్టుకుపోయినా నేటికీ బాధితులకు ఎటువంటి న్యాయం జరగలేదు. పూర్తిగా పాడైన ఆరు గ్రామాల ప్రజలకు పక్కాగృహాలు మంజూరు చేసి ప్రత్యేక కాలనీల ఏర్పాటుకు సిద్ధమైనా ఆ పక్కా గృహాలు 50 శాతం నేటికీ పూర్తి కాలేదు. అన్నమయ్య ప్రాజెక్టు దుర్ఘటనలో పులపత్తూరు, తొగురుపేట, రామచంద్రాపురం, మందపల్లె, గుండ్లూరు తదితర గ్రామాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రాజెక్టు దిగువనున్న నందలూరు, పెనగలూరు, రాజంపేట చెయ్యేరు నది పరీవాహక ప్రాంతాల్లో సుమారు 50 గ్రామాల్లో వరదనీరు ప్రవహించి పూర్తిగా పంట పొలాలను ధ్వంసం చేశాయి. ఒక్క కరెంటు స్తంభం కూడా లేకుండా బోరుబావులు పూడిపోయాయి. సర్వస్వం కోల్పోయిన ఆ గ్రామస్థులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన ప్రభుత్వాలు నేటికీ అమలు చేయకపోవడంతో అక్కడి బాధితుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.



అన్నమయ్య ప్రాజెక్టు బాధితులను ఆదుకుంటామని నాడు ప్రతిపక్ష నేతగా హామీ ఇస్తున్న చంద్రబాబునాయుడు (ఫైల్)

ప్రాజెక్టును పునర్ నిర్మించాలి

అన్నమయ్య ప్రాజెక్టును పునర్ నిర్మించి ఎగువ, దిగువ ప్రాంతాలను ఆదుకోవాల్సి ఉంది. లేకుంటే ఎగువ ప్రాంతమైన 22,500 ఎకరాల ప్రాజెక్టు ఆయకట్టు భూమి ఎడారిగా మారి, సంబంధిత గ్రామాల ప్రజలు సాగు, తాగునీరు దొరక్క వలస వెళ్లే ప్రమాదం ఉంది. ప్రాజెక్టు పరీవాహక గ్రామాల్లో రక్షణగోడలు ఏర్పాటు చేయాలి. వరద నీరు ప్రవహించి పొలాలన్నీ ఇసుకతో నిండిపోయాయి. ఇసుకమేటను తొలగిస్తామన్న హామీ నెరవేరలేదు. దీంతో భూములు వ్యవసాయానికి పనికి రాకుండా పోయాయి. వెంటనే ఇసుకమేటలు తొలగించాలి. పులపత్తూరు, మందపల్లె, పాపరాజుపల్లె, శేషమాంబపురం గ్రామాలకు వెంటనే తారురోడ్డును ఏర్పాటు చేసి రవాణా వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం ఉంది.



ప్రాజెక్టు తెగిపోవడంతో అలంకార ప్రాయంగా మారిన పుల్లంపేట రక్షిత మంచినీటి పథకం

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రాజెక్టు తెగిపోయినప్పుడు పూర్తిగా నేలమట్టమైన ప్రజలకు సుమారు వెయ్యి గృహాల పునుద్ధరణకు ప్రభుత్వం ప్రత్యేక కాలనీలను ఏర్పాటు చేసినా 50 శాతం కూడా పూర్తి కాలేదు. పులపత్తూరులో 3 కాలనీలు, తొగురుపేటలో ఒక నూతన కాలనీకి శ్రీకారం చుట్టినా ఇంటి నిర్మాణాలు పూర్తి కాలేదు. కొత్త కాలనీల్లో నీరు, కరెంటు, రోడ్లు లాంటి మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయలేదు. వెంటనే ఇళ్లను పూర్తి చేసి మౌలిక సదుపాయాలు కల్పించాలి.

నాలుగేళ్లయినా అతీగతీ లేదు



ప్రాజెక్టు తెగిపోయి నాలుగేళ్లయినా అతీగతీ లేదు. జగన్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ఒక్కటీ నెరవేరలేదు. వైసీపీకి బలం ఉన్న గ్రామాల్లో విరివిగా అభివృద్ధి పనులు చేసి టీడీపీకి బలమైన మందపల్లె, తొగురుపేట లాంటి మా గ్రామాలకు తీవ్ర అన్యాయం చేసింది. వరద నీరంతా మా గ్రామంపైనే ప్రవహించి వందలాది ఎకరాల భూములు ఆనవాళ్లు లేకుండా పోయాయి. మా గ్రామాలను ఆదుకోవడంలో జగన్ ప్రభుత్వం తీవ్ర ద్రోహం చేసింది.

- కొండా కుమార్, బాధిత రైతు, మందపల్లె.

ఇసుకమేటలను తొలగించలేదు



కనీసం పంట పొలాల్లో వేసిన ఇసుక మేటలను ప్రభుత్వం తొలగించలేదు. మాకు సంబంధించి 10 ఎకరాల భూమి, నాలుగు బోర్లు ఇసుకమేటలో కలిసిపోయాయి. నా భూమి ఎక్కడుందో నాకు ఇప్పటికీ తెలియదు. నాలుగు బోర్లు ఎక్కడున్నాయో తెలియదు. ఏడాదికి మూడు కార్లు పంటలు పుష్కలంగా పండేవి. అనేక మంది రైతులు భూములు కనుక్కోలేని పరిస్థితిలో ఉన్నారు. కనీసం రోడ్లు వేయలేదు. ఇళ్లు పూర్తి చేయలేదు. ప్రాజెక్టును పునరుద్ధరించలేదు. ఈ విధంగా చేస్తే ప్రభుత్వాలపై ప్రజలకు ఏమి నమ్మకం ఉంటుంది. ఎవరిచావు వారు చావాల్సిందేనా.

- ప్రతాప్‌రెడ్డి, బాధిత రైతు, పులపత్తూరు గ్రామం

చెరువులకు వెలిగల్లు నీరు

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



దొర్రిచెరువులో జలహారతి పడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె, రామాపురం, గాలివీడు మండలాల్లోని అన్ని చెరువులను వెలిగల్లు ప్రాజెక్టు నీటితో నింపుతామని, కుడి, ఎడమ కాలువలకు మరమ్మతులు చేయించి మిగిలిన చెరువులకు కూడా నీరందిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం దొర్రిచెరువులో మంత్రి జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 3న రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు మండలాల్లోని చెరువులకు కుడి కాలువ ద్వారా నీరు వదిలామని, దీంతో ఇప్పటికే మూడు మండలాల్లో 69 చెరువులు నిండిపోయాయని తెలిపారు. వెలిగల్లు ప్రాజెక్టులో 4.6 టీఎంసీల నీరు ఉండగా ప్రస్తుతం ఒక టీఎంసీ నీళ్లు వదిలామన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని చెరువులకు వెలిగల్లు ప్రాజెక్టు నీరు అందిస్తామన్నారు. కుడి, ఎడమ కాలువతో పాటు పిల్ల కాలువలకు మరమ్మతులు చేయించి వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా 24 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తామన్నారు. అనంతరం లక్కిరెడ్డిపల్లెలోని కమ్యూనిటీ ఆసుపత్రి రోడ్డు నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అటవీశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఎర్రగోళ్ల రెడ్డెయ్యయాదవ్, మార్కెట్ యార్డు చైర్మన్ షఫీనాయక్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పోలిరెడ్డి సుబ్బారెడ్డి, బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు విజయభాస్కర్, మాజీ ఎంపీపీ ఉమాపతిరెడ్డి, టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్య క్షుడు దిన్నెపాడు శ్రీనివాసులు, దిన్నెపాడు రవిరాజు, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు అజ్మ తుల్లా, సిద్దక వెంకట్రామిరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాజేందర్‌రెడ్డి, మండ్ల రా మాంజనేయులు, డీఈ రమణయ్య, మైనర్ ఇరిగేషన్ జేఈ బాషా, బడుగు వాసు దేవుడు, టీడీపీ నాయకులు, తదతరులు పాల్గొన్నారు

దుబ్బిగానిపల్లె వాటర్‌షెడ్‌కు జల్‌శక్తి అవార్డు

- రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్న కలెక్టర్



ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా జల్‌శక్తి అవార్డు అందుకుంటున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

మదనపల్లె టౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా జాతీయ స్థాయిలో నిర్వహించే జల్‌శక్తి అవార్డుల్లో భాగంగా ఈ ఏడాది జిల్లాలోని మదనపల్లె నియోజకవర్గంలోని దుబ్బిగానిపల్లె వాటర్‌షెడ్ జాతీయస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించింది. ఇందులో భాగంగా మంగళవారం ఢిల్లీలో రాష్ట్రపత్రి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా కలెక్టర్ నిశాంత్‌కుమార్ అవార్డు అందుకున్నారు. కేంద్ర జల్‌శక్తి ఆధ్వర్యంలో వాటర్ రీసోర్స్, రివర్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా జల్‌శక్తి శాఖ సత్ఫలితాలు ఇచ్చిన వాటర్‌షెడ్ పనులకు అవార్డులు ఇస్తోంది. మదనపల్లె మండలం దుబ్బిగానిపల్లె వద్ద 2022 సంవత్సరంలో రూ.74.96 లక్షలతో నిర్మాణాలు చేపట్టిన వాటర్‌షెడ్ పనులు రెండేళ్లలో పూర్తి చేశారు. ఇందులో 100 శాతం ఫలితాలు సాధించడంతో కేంద్ర జల్‌శక్తి బృందం గత డిసెంబరులో వచ్చి వాటర్‌షెడ్ పనులు పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపింది. ఇందులో భాగంగా దుబ్బిగానిపల్లె వాటర్‌షెడ్‌కు జల్‌శక్తి అవార్డు ఎంపిక కావడంతో కలెక్టర్, డ్వామా పీడీలను అవార్డుల ప్రధాన కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. దీంతో ఢిల్లీలోని విజ్ఞానభవన్‌లో మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా కలెక్టర్ జల్‌శక్తి అవార్డుతో పాటు, ట్రోఫీ, రూ.2 లక్షల నగదు అందుకున్నారు.

ఆనందం ఆవిరి

- మృత్యుఒడిలోకి భార్యాభర్తలు
- కొండారెడ్డిపోడులో విషాదఛాయలు



విజయ్, శ్రావ్య (ఫైల్ ఫోటో)

రైల్వేకోడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): లక్షల్లో జీతం, ఓవైపు తండ్రి కాబోతున్నానని సంతోషం, ఇంతలోనే విషాదం మిగిల్చింది. ఎనిమిది నెలలు నిండిన గర్భవతికి కవల పిల్లలు గర్భంలోనే ఆక్సిజన్ అందక చనిపోయారు. తల్లికి లోబీపీ వచ్చి మృతి చెందింది. దీనిని తట్టుకోలేక భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి హైద్రాబాద్‌లోని శంషాబాద్ ప్రాంతంలో జరిగింది. రైల్వేకోడూరు మండలంలోని కొండారెడ్డిపోడు గ్రామానికి చెందిన ముత్యాల శంకరయ్య, లలితలకు ఇద్దరు కుమారులు పెద్ద కుమారుడు ముత్యాల ప్రవీణ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తుండగా రెండో కుమారుడు ముత్యాల విజయ్ హైద్రాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. అనంతపురానికి చెందిన శ్రావ్య, విజయ్ ప్రేమించుకుని పెద్దల ఒప్పందంతో ఎనిమిదేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. ఇరువురూ శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు దగ్గరలోనే నివాసం ఉంటున్నారు. విజయ్ భార్య 8 నెలల గర్భిణి. ఆమెకు లోబీపీ ఉందని సోమవారం సాయంత్రం ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. శ్రావ్య గర్భంలో ఉన్న కవలలు ఆక్సిజన్ అందక మృతి చెందారు. అనంతరం శ్రావ్య కూడా మృతి చెందింది. దీంతో కలత చెందిన విజయ్ ఇంటికి వచ్చి ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. వారి మృతితో స్వగ్రామం కొండారెడ్డిపోడులో విషాదఛాయలు అలుముకున్నాయి. బుధవారం గ్రామంలో అంత్యక్రియలు చేస్తున్నట్లు బంధువులు సిద్ధం చేస్తున్నారు.

అయ్యప్పనాయుని చెరువులో భారీగా చేప పిల్లలు మృతి



ఒడ్డుకు కొట్టుకు వచ్చిన చేపలు

పీలేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పీలేరు అయ్యప్పనాయుని చెరువులోని కాలుష్యం కారణంగా భారీగా చేప పిల్లలు మృత్యువాతపడ్డాయి. తుఫాను కారణంగా మంగళవారం ఉదయం పీలేరు వర్షం కురిసింది. వర్షం వెలసిన తరువాత చేప పిల్లలు అధిక సంఖ్యలో మృత్యువాత పడి ఒడ్డుకు కొట్టుకువచ్చాయి. ప్రస్తుతం మొరవపోతున్న అయ్యప్పనాయుని చెరువు కాలువల్లో చనిపోయిన చేప పిల్లలు దర్శనమిస్తున్నాయి. చెరువులో పెరిగిపోయిన కాలుష్యం కారణంగా ఆక్సిజన్ అందక చేప పిల్లలు, ఓ మోస్తరు చేపలు మృత్యువాతపడ్డాయని సాగునీటి సంఘం అధ్యక్షుడు హరి తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు అయ్యప్పనాయుని చెరువు ప్రక్షాళనపై దృష్టి సారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో తండ్రీకొడుకులకు మూడేళ్లు జైలుశిక్ష



జైలుశిక్ష పడ్డ నిందితులు

రాయచోటిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో తండ్రీకొడుకులకు తిరుపతిలోని ఆర్‌ఎస్ఎస్ ఏడీజే కోర్టు జిల్లా అదనపు న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు ఇచ్చారని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తెలిపారు. పెద్దమండెం మండలం గుర్రకొండ-గాలివీడు మెయిన్ రోడ్డులోని పాపేపల్లె క్రాస్ వద్ద ఎర్రచందనాన్ని అక్రమంగా తరలిస్తుండగా 2015 ఏప్రిల్‌లో పెద్దమండెం పోలీసులు తండ్రీకొడుకులు నాగన్న, గుట్టపాలెం చంద్రశేఖర్‌నాయుడులను అరెస్టు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో వారిద్దరికి మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.20 వేలు జరిమానా విధిస్తూ తీర్పును ఇచ్చినట్లు ఎస్పీ తెలియజేశారు. జిల్లాలో అటవీ సంపదను కాపాడటానికి పోలీసులు దృఢ సంకల్పంతో ఉన్నారని, ఎర్రచందనం అక్రమ రవాణాపై జిల్లా పోలీసులు పోరాటాన్ని కొనసాగిస్తారని, ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్‌ఐ కారు ఘటనపై కేసు నమోదు



పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితుడి కుటుంబీకులు

ములకలచెరువు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రం ఎస్‌ఐ హరిహరప్రసాద్ కారు ఢీకొన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి తీవ్రంగా గాయపడిన ఘటనపై ఎట్టకేలకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 7వ తేదీ ములకలచెరువు మండలం పెద్దపాళ్యం ఫ్లైఓవర్‌పై పీటీఎం ఎస్‌ఐ కారు వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో శ్రీసత్యసాయి జిల్లా అహమ్మదాబాద్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సుల్తాన్ తీవ్రంగా గాయపడి తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే ప్రమాదం జరిగిన రోజున ఎస్‌ఐ కారుకు ఇన్సూరెన్స్ లేకపోవడంతో నెంబరు ప్లేట్లను తొలగించి కారును దాచేసిన విషయం విదితమే. అయితే పోలీసులు కేసు నమోదు చేయకుండా తమను భయపెడుతున్నారని బాధిత కుటుంబీకులు సోమవారం ఎస్పీ ధీరజ్ కునుబిల్లిని కలిసి ఫిర్యాదు చేశారు. తక్షణం స్పందించిన ఎస్పీ వెంటనే కేసు నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో పోలీసులు రోడ్డు ప్రమాదంపై సోమవారం రాత్రి పీటీఎం ఎస్‌ఐ హరిహరప్రసాద్ కారు నడిపిన కానిస్టేబుల్ మౌలాలిపై కేసు నమోదు చేశారు. వారం రోజుల్లో కేసుకు సంబంధించి చార్జిషీట్ దాఖలు చేసి కారుకు ఇన్సూరెన్సు కూడా కట్టని పీటీఎం ఎస్‌ఐ హరిహరప్రసాద్ పేరును కూడా కేసులో చేరుస్తామని పోలీసులు తెలియజేశారని బాధిత కుటుంబీకులు విలేకరులకు చెప్పారు.

అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల అరెస్టు

- రిమాండ్‌కు నిందితుల తరలింపు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె అర్బన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అంతర రాష్ట్ర సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మదనపల్లె డీఎస్పీ మహేంద్ర తెలిపారు. మంగళవారం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో మియాపూర్‌కు చెందిన వెంకటేశ్, ఎగిలిపల్లె వినోద్ యాదవ్ ఇద్దరూ కలిసి సైబర్ నేరాలకు పాల్పడేవారు. వీరు ముందుగా అమాయకులను, విశ్రాంత ఉద్యోగులను టార్గెట్ చేసుకుని వారికి వాట్సాప్ కాల్ చేసి ట్రాప్ చేసి సీబీఐ అధికారులమని నమ్మించి నకిలీ గుర్తింపు కార్డులు, పోలీసుల యూనిఫాంలో ఉన్న వారిని చూపి భయపెట్టి డబ్బు దోచుకుంటూ సైబర్ నేరాలు చేస్తున్నారన్నారు. వీరిద్దరూ ఢిల్లీ వెళ్లి అక్కడ సైబర్ ముఠా సాహు, దీపక్, జాక్‌తో కలిసి ఓ హోటల్ రూమ్‌లో 89818 10893, 98319 83580 నెంబర్ల ద్వారా వీడియో కాల్స్ చేసి బెంగళూరు సీబీఐ అధికారులమని మదనపల్లె పట్టణానికి చెందిన గల్లా కృష్ణవేణమ్మను బెదిరించారు. ఆధార్ కార్డు, హ్యూమెన్ ట్రాఫికింగ్ కేసులో నువ్వు ఉన్నావని భయపెట్టారు. దీంతో కృష్ణమేణమ్మ వివిధ బ్యాంకుల ఖాతాలకు మొత్తం రూ.36 లక్షలు జమ చేసింది. వారు మళ్లీ మళ్లీ డబ్బు డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చి ఆమె మదనపల్లె టూటౌన్ పోలీసులను ఆగస్టులో ఆశ్రయించింది. మదనపల్లె టూటౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్‌ఐ రహీముల్లా బృందాలుగా ఏర్పడి సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులను మంగళవారం పీలేరు పట్టణం రైల్వే గేట్ వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసులో ప్రతిభ చూపిన టూటౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్‌ఐ రహీముల్లా, హెడ్ కానిస్టేబుల్ వేణు, కానిస్టేబుల్స్ భద్రానాయక్, రవి నాయక్, జిల్లా సైబర్ క్రైం సిబ్బందిని డీఎస్పీ అభినందించిన నగదు బహుమతులు అందించారు. సీబీఐ, ఈడీ,ఎన్ఐఏ, ఆర్‌బీఐ పోలీసు అధికారుల పేరుతో ఫోన్ కాల్స్‌చేస్తూ డబ్బు అడిగితే వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ 1930కు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ తెలిపారు.

రెడ్డెమ్మకు రూ.7.27 లక్షల ఆదాయం



రెడ్డెమ్మకొండలో వేలం నిర్వహిస్తున్న అధికారులు

గుర్రంకొండ, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెడ్డెమ్మకొండ దేవస్థానంలో నిర్వహించిన వివిధ రకాల వేలం ద్వారా అమ్మవారికి రూ.7.27 లక్షల ఆదాయం వచ్చినట్లు చైర్మన్ రాజన్ననాయుడు తెలిపారు. టోల్‌గేట్, టీ, టిఫిన్ హోటల్, వస్త్రాల సేకరణ, కూల్ డ్రింక్స్, ల్యామినేషన్ ఫొటోలు, కొబ్బరి కాయలు, పూజాసామగ్రి విక్రయించుకునేందుకు మంగళవారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా రూ.7.27 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కొబ్బరికాయలు, పూజా సామగ్రి అమ్ముకొనే హక్కుకు పాటదారులు ముందుకు రానందున వాయిదా పడినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని ఆలయాభివృద్ధికి వినియోగిస్తామన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారి రవికుమార్, ఈవో మంజుల, ఎంపీటీసీ రెడ్డిప్రసాద్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.4.64 లక్షలు

చెర్లోపల్లె రెడ్డెమ్మ అమ్మవారి హుండీని మంగళవారం దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో లెక్కించారు. రెండు నెలలకు హుండీని లెక్కించగా రూ.4,64,466 నగదు, బంగారం 65 గ్రాములు, 192 గ్రాముల వెండి వచ్చినట్లు చైర్మన్ రాజన్ననాయుడు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారి రవికుమార్, ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు, పక్కా గృహాలకు దరఖాస్తు చేసుకోండి

రామాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యో తి): పక్కా గృహాలు, ఇంటి స్థలాలకు అర్హులైన నిరుపేదలు దరఖాస్తు ఆయా గ్రామాల సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ వెంకటేశులు, హౌసింగ్ ఏఈ కేఎస్‌యం ప్రసాద్‌లు తెలిపారు. స్థానిక రెవెన్యూ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వారు విలే కరులతో మాట్లాడుతూ మండలంలోని పది గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న లబ్దిదారులు ఇంటి స్థలం, పక్కా గృహాల కోసం ఈ నెలలో 30వ తేదీలోపు దరఖా స్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్య సంరక్షణ

గాలివీడు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య పరి రక్షణ సాధ్యమని మలేరియా సబ్ యూనిట్ అధికారి జయరాం తెలిపారు. మంగళవారం ఆయన నూలివీడు ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాన్ని, ల్యాబ్‌ను పరిశీ లించారు. అలాగే స్థానిక బాలుర వసతి గృహాన్ని, నూలివీడు జెడ్పీ ఉన్నత పాఠ శాల పరిసరాలను పరిశీలించారు. అనం తరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరా లను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాల న్నారు. ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా మలేరి యా, టైఫాయిడ్, సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచి ంచారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ ఈవో శ్రీనివాసరెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు అహ్మద్, కళావతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సహాయం

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి): లక్కిరెడ్డిపల్లెలోని కోర్టు వద్ద ఈనెల 16వ తేదీ జరిగిన రోడ్డు ప్రమా దంలో గాయపడిన అజయ్ కుటుంబానికి నలందా హైస్కూల్ యాజమాన్యం ఆర్థిక సహాయాన్ని అందజేసింది. ఆ స్కూలు కరస్పాండెంట్ బాలసు బ్రమణ్యం, వెంకట్ర మణలు రూ.6వేలు ఆర్థిక సహా యం అందజేశారు. పేద కుటుంబానికి చెందిన అజయ్‌కి మరికొందరు దాతలు ఆర్థిక సాయం చేయా లని వారు కోరారు.

భుజంగేశ్వరుడికి అన్నాభిషేకం



రైల్వేకోడూరు, నవం బరు 18 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని భుజంగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం స్వామి వారికి అన్నాభిషేకం చేశారు. ఈ సంద ర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భుజంగేశ్వరుడు, భువనేశ్వరి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

శివపార్వతులకు ప్రత్యేక పూజలు





పెనగలూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో చివరి మంగళవారం సందర్భంగా పెనగలూరులోని కామాక్షమ్మ, నైనాదీశ్వరులకు ప్రత్యేక అలంకరణలు చేసి మంగళ ప్రదంగా పూజా కార్య క్రమాలు నిర్వహించారు. కార్తీకమాసంలో ముగింపు పూజా కార్యక్రమాల సందర్భంగా నిర్వాహకులు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆలయ భూములను రక్షిస్తాం...



ఫిర్యాదుపై విచారిస్తున్న జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్

సుండుపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విరూపాక్ష చెన్నకేశవస్వామి ఆలయ భూములను రక్షిస్తామని దేవదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు. మంగళ వారం మండల కేంద్రంలోని విరూపాక్ష చెన్నకేశవస్వామి ఆలయాన్ని ఆయన పరిశీలించారు. మండలంలోని సోమల రాజుగారిపల్లెకు చెంది న రెడ్డెయ్యరాజు తన పట్టా భూమిలో ఆలయానికి సంబంధించి గోడ నిర్మాణం చేశారని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు స్థానికులను విచారిస్తే భక్తులు పూజారి తదితరులు ఆలయ భూమి అన్యాక్రాంతం అవుతోందని, ఆ భూమిని కాపాడాలని కోరినట్లు తెలిపారు. వెంటనే సుండుపల్లె తహసీల్దార్ మహబూబ్‌చాంద్‌తో ఆలయ భూములకు కొలతలు వేసి హద్దులు చూపించాలని కోరామన్నారు. శివాలయం తూర్పు భాగాన ఆలయ భూములు ఉన్నాయని, హద్దులు ఏర్పాటు చేస్తే ఆ భూమిలో కోనేరు నిర్మాణం చేసుకుంటామని స్థానికులు కోరారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కొండారెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

ఉత్పత్తి రంగంలో మహిళలు రాణించాలి



మాట్లాడుతున్న జిల్లా ఉపాధి అధికారి ప్రసాద్

రైల్వేకోడూరు రూరల్, నవం బరు 18 (ఆంధ్రజ్యోతి): మహి ళలు ఉత్ప త్తి రంగంలో రాణిం చాలని జిల్లా ఉపాధి అధికారి కె.ప్రసాద్ తెలిపారు. మంగళ వారం రైల్వేకోడూరు పట్టణంలో నిర్వ హిస్తున్న టైలరింగ్ శిక్ష ణను పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు టైలరింగ్‌తో ఉపాధి పొందతున్నారని తెలిపారు. దుస్తుల తయారీలో కొత్తదనం చూపిస్తే మరింత లాభాలు వస్తాయని తెలిపారు. మహిళలు ఫుడ్ ప్రాడెక్ట్స్, గార్మెంట్స్, బ్యూటీపార్లర్, పాల కేంద్రాలు తదితర వాటిని ఏర్పా టు చేసుకుంటే ఆర్థికంగా నిలదొక్కుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న మహిళలకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కె.పార్థ సారిథి, ముస్కినా, ట్రైనర్ కావ్య, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎంఈవో చక్రేనాయక్

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని ఎంఈవో చక్రేనాయక్ పేర్కొన్నారు. 58వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. గ్రంథాలయాల్లో విద్యార్థులకు మంచి జ్ఞానాన్ని అందించే పుస్తకాలు ఉంటాయన్నారు. అనంతరం విద్యార్థులకు క్రీడా, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రమేశ్, విద్యా కమిటీ మెంబర్ చంద్రకళ, సీఆర్పీ రాంమోహన్, విద్యార్థులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

సిద్దవటం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థిదశ నుంచే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సిద్దవటం గ్రంథాలయ అధికారిని లక్ష్మీనారాయణ తెలిపారు. 58వ గ్రంథాలయ వార్షికోత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యార్థిని విద్యార్థులకు స్థానిక గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, శ్రీవాణి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



సీఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

ఓబులవారిపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యాల పాలై ఆర్థికంగా ఇబ్బందులు పడిన కుటుంబాలను ఆదుకునేం దుకు సీఎం సహాయనిధి బాసటగా నిలుస్తుందని ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ అరవ శ్రీధర్ అన్నారు. ఈ సందర్భంగా మండలం లోని ఓబులవారిపల్లె, వైకోట, గోవిందంపల్లి, మంగంపేట గ్రామ పంచాయతీల్లో పలువురు అనారోగ్యబాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులను స్థానిక నాయకులతో కలిసి వారి ఇళ్ల వద్దకు వెళ్లి అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ కూటమి ప్రభుత్వం ఆపదలో ఉన్న ప్రతిఒక్క కుటుం బాన్ని ఆదుకుంటుందని తెలిపారు. మహిళా నాయకు రాలు ముక్కా వరలక్ష్మి, టీడీపీ సీనియర్ నాయకులు పున్నాటి వాసు దేవరెడ్డి, కల్లా చలపతి, పయ్యావుల కోటేశ్వరరావు, శివయ్యనా యుడు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలి

రాయచోటిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులు, గ్రీన్ అంబాసిడర్‌లకు 5 నెలల పెండింగ్ జీతాలు వెంటనే ఇవ్వాలని ఏపీ గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు, జిల్లా గౌరవాధ్యక్షుడు అబ్బవరం రామాంజులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్మికుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్మికులకు ప్రతి నెల వేతనాలివ్వడంలో అధికారులు విఫలం అవుతున్నారన్నారు. పన్నులు వసూలు చేసిన జనరల్ ఫండ్ మొదలుకుని 15వ ఆర్థిక సంఘం నిధులను కార్మికులకు జీతాలివ్వకుండా ఇష్టానుసారం దుర్వినియోగం చేస్తున్నారన్నారన్నారు. కరోనా సకాలంలో పని చేసిన కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కొబ్బరినూనె, సబ్బులు, మాస్కులు నాణ్యమైన పనిముట్లు ఇవ్వాలన్నారు. పెండింగ్ జీతాలు, 13వ పీఆర్సీ అమలు కోసం డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సీఐటీయూ అఖిల భారత మహాసభలో కార్మికుల అభివృద్ధికి తీర్మానాలు చేసి నివధిక పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు ఏవీ రమణ, దేవరాయలు, ఆంజనేయులు, చెన్నయ్య, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

జన గణనతో పాటు కుల గణన చేయాలి







రాజంపేట, రైల్వేకోడూరులోని అంబేద్కర్ విగ్రహాల వద్ద, రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నేతలు

రాజంపేట, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో జన గణనతో పాటు కుల గణన తప్పకుండా చేయాలని రాజంపేటలో సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. రాజంపేట అంబేద్కర్ విగ్రహం ఎదుట సీపీఐ నాయకులు సికిందర్, ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ సామాజిక న్యాయం కోసం జనగణనతో పాటు కుల గణన తప్పనిసరి అన్నారు. దేశంలో రాజ్యాంగాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయకపోవడంతో అణగా రిన వర్గాలకు న్యాయం జరగలేదన్నారు. ప్రజలకు కావాల్సింది మత గణన కాదని, కుల గణన అన్నారు. జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కల్పించాలన్నారు. కార్యక్ర మంలో సీపీఐ నాయకులు నాగేశ్వరరావు, రమణ, మస్తాన్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిలో నిరసన

రాయచోటిటౌన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దేశంలో జనగణనతో పాటు కులగుణన కూడా జరగాల్సిందేనని, దేశంలో దళితులు, గిరిజ నులు, మహిళలు, మైనార్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మహేశ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం రాయచోటి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో బీజేపీ ఆర్ఎస్ఎస్ భక్తులు సనాత ధర్మాన్ని అడ్డుపెట్టుకొని మహి ళలు, దళితులు, గిరిజనులు, మైనార్టీలపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికైనా భిన్నత్వంలో ఏకత్వం అయిన భారత దేశాన్ని మతోన్మాద శక్తుల నుంచి భరత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమా ఖ్య జిల్లా కార్యదర్శి సుమిత్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు కోటేశ్వరరావు, సీపీఐ పట్టణ కార్య దర్శి జగన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

దళిత, గిరిజన, మైనార్టీలపై దాడులను అరికట్టాలి

రైల్వేకోడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దళిత, గిరిజన, ముస్లిం, మైనార్టీ, క్రిస్టియన్లపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు పండుగోల మణి, సీపీఐ మండల కార్యదర్శి దార్ల రాజశేఖర్‌లు తెలిపారు. మంగళవారం సీపీఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రైల్వేకోడూరు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో దళిత, గిరిజన, క్రిస్టియన్, ముస్లింలపై దాడులు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జయరామయ్య, కమిటీ సభ్యురాలు హాజీమాబీ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలి



మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నేతలు

రాజంపేట టౌన్, నవంబరు 18 (ఆంధ్ర జ్యోతి) : వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలని బీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అంజి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని బైపాస్ రోడ్డులోని వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలోకి చేరుస్తామని ఇచ్చిన హామీ నేటికి నెరవేరలేదన్నారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం వాల్మీకుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రధానంగా వాల్మీకులు అన్ని రంగాలుగా వెనుకబడి ఉన్నారని, వారి సంక్షేమానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. నాడు వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకి కులస్థులను ఎస్టీ జాబితాలోకి చేరుస్తామని చెప్పి మాట తప్పారన్నారు. ఓట్ల కోసం వాగ్దానాలు చేస్తున్నారే తప్ప మాట నిలబెట్టుకోవడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలిపిన వాల్మీకి కులస్థులపై కేసులు నమో దు చేశారని, వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా వాల్మీకి కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్చకపోతే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రజా సంఘాలను కలుపుకుని ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులు సుదాకర్, రవి, శ్రీను, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేతో లెప్రసీ వ్యాధి గ్రస్తులను గుర్తిద్దాం



లెప్రసీ సర్వేని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

రాయచోటి నేతాజీ సర్కిల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): లెప్రసీ సర్వేతో వ్యాధిగ్రస్తులను గుర్తించి.. సకాలంలో వైద్యం అందించి నయం చేద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాధిక తెలిపారు. మంగళవారం ఎస్ఎన్ కాలనీలో లెప్రసీ సర్వేని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెల 17 నుంచి 30 వరకు లెప్రసీ సర్వే నిర్వహించాలన్నారు. సర్వే జరిగే తీరును పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటిని, ప్రతి వ్యక్తిని సందర్శించి స్పర్శ లేని మచ్చలను గుర్తించి వారిని ప్రభుత్వాసుపత్రులకు పంపించాలని తెలిపారు. ఈ సర్వేతో బాధితులను త్వరగా గుర్తించి, చికిత్స చేసే అవకాశం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎన్‌కాలనీ హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, ఏఎన్‌యం కదరున్నిషా, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు



ప్రజల సమస్యలు వింటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందే విధంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం మంత్రి తన స్వగ్రామం బోరెడ్డిగారి పల్లెలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీక రించి సమస్యల పరిష్కారానికి తక్షణమే అధికారులను ఆదేశించారు. పలు సమస్యలకు పరిష్కారం చూపడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రిని పలువురు అధికారులు, నాయకులు దుశ్శాలువాలతో, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు.

జాతీయ స్థాయి జంబోరికి సంబేపల్లె హైస్కూల్ విద్యార్థులు



జంబోరి కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులు

రాయచోటి నేతాజీ సర్కిల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): లక్నోలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ నిర్వహిస్తున్న జాతీయ స్థాయి జంబోరి కార్యక్రమంలో పాల్గొనడానికి సంబేపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు వెంకటేశ్వర, సాయి వెళ్లారని ప్రధానోపాధ్యాయుడు సుంకర రామకృష్ణ మంగళవారం తెలిపారు. భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ 75వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 23 నుంచి 29 వరకు 19వ జాతీయ జంబోరి నిర్వహిస్తున్నారని తెలిపారు. వీరికి స్కౌట్ మాస్టర్లు మార్ల ఓబుల్‌రెడ్డి, చింతం విజయ సారధిరెడ్డి అభినందనలు తెలిపారు.


మాతృత్వం ఒక వరం..



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

చిట్వేలి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాతృత్వం ఒక వరమని, అందుకు దత్తత మరో మార్గం అని జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పి.రామలక్ష్మీ అన్నారు. చిట్వేలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిట్వేలి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో అంతర్జాతీయ దత్తత మహోత్సవంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు లేని తల్లిదండ్రులకు ప్రేమను పంచే కుటుంబాన్ని ఏర్పాటు చేయడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని, 0-18 సంవత్సరాలు గల పిల్లలను ఎవరైనా అనధికార దత్తత తీసుకున్నట్లైతే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబరుకు సమాచారం ఇవ్వవచ్చని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.దుర్గరాజు, ఉపాధ్యాయులు శివనారాయణ, మధు, రమాదేవి, నాగలక్షుమ్మ, కేజీబీవీ ప్రిన్సిపాల్ తులసి, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ పోటీల్లో కోడూరు విద్యార్థి ప్రతిభ



విద్యార్థి చైతన్యను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

రైల్వేకోడూరురూరల్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో రైల్వేకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి జి.చైతన్య విశేషంగా ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ యశోదర, ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి చంద్రమోహన్‌రాజులు తెలిపారు. మంగళవారం కళాశాలలో విద్యార్థి చైతన్యను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ విద్యార్థి జాతీయస్థాయి పోటీలకు ఎంపికకావడం హర్షణీయమన్నారు. త్వరలో డిల్లీలో నిర్వహించే జాతీయ పోటీల్లో బాగా రాణించి కళాశాలకు పేరు తీసుకురావాలన్నారు.

ఉపాధ్యాయులకు ఆటలు

● మండలస్థాయిలో 29, 30 తేదీలలో ● డివిజన్ స్థాయి డిసెంబరు 13, 14 తేదీలలో... ● జిల్లాలో 8,482 మందికి పైగా ఉపాధ్యాయులు ● సన్నాహాలు చేస్తున్న పాఠశాల విద్యాశాఖ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలు గుర్తించి ప్రోత్సహించి భావిపౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక భూమిక పోషించే ఉపాధ్యాయుల్లో మానసిక ఒత్తిడిని దూరం చేసేలా, మరింత ఉత్సాహంగా బోధన చేసేలా శారీరక, మానసిక సామర్థ్యం పెరిగేలా ప్రభుత్వం ఆటలపోటీలు నిర్వహించేందుకు సిద్ధమైంది. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఈనెల 16వ తేదీన ఆదేశాలు జారీ చేశారు.

కడప జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపాలిటీ, ఎయిడెడ్ పాఠశాలలో దాదాపు 8,482 మందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఉపాధ్యాయుల్లో కూడా అంతర్లీనంగా ఉన్న క్రీడానైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. పురుష టీచర్లకు క్రికెట్, మహిళ టీచర్లకు త్రోబాల్ తదితర పోటీలు నిర్వహించనున్నారు. తొలుత మండల స్థాయి తర్వాత డివిజన్‌స్థాయిలో నిర్వహించనున్నారు. డివిజన్ స్థాయిలో నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ బాధ్యతలను మండలస్థాయిలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌కు అప్పగించారు.

మండల స్థాయిలో ఎంఈఓ 1, 2 నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారు. డివిజన్ స్థాయిలో డిప్యూటీ డీఈఓ, జిల్లాస్థాయిలో డీఈఓ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి సమన్వయకర్తలుగా ఉంటారు. రాష్ట్రస్థాయిలో పోటీలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రకార్యదర్శి జేడీ స్థాయిలో అధికారి బాధ్యతలు తీసుకుంటారు. పోటీలకు తొలుత మండలస్థాయి జట్లను ఎంపిక చేస్తారు. ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలకు సంబంధించి ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుడు ముగ్గురు, పాఠశాల సహాయకులు, నాన్ లాంగ్వేజ్ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్, పీఈటీలు, ఏడుగురు ఎస్‌జీటీల సహా మొత్తం 16 మందితో కమిటీ ఏర్పాటుచేస్తారు. అదేవిధంగా త్రోబాల్ ఇతర క్రీడలకు ప్రత్యేకంగా జట్లను ఎంపిక నిర్వహిస్తారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి డీఈఓలకు ఆదేశాలు జారీ అయ్యాయి.

ఆటలపోటీల వివరాలు

మండలస్థాయిలో ఈనెల 29, 30 తేదీలలో నిర్వహించనున్నారు. డివిజన్ స్థాయిలో డిసెంబరు 13, 14 తేదీలలో, జిల్లాస్థాయిలో డిసెంబరు 20, 21, 22 తేదీలలో రాష్ట్రస్థాయిలో జనవరి 2, 3, 4 తేదీలలో నిర్వహిస్తారు. ఈ ఆటల ద్వారా ఉపాధ్యాయులలో శారీరక దృఢత్వం, ఆరోగ్యం పెంపొందించి ఒత్తిడిని తగ్గించడం, జట్టు స్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, వినోద కార్యక్రమాలకు వేదికను అందించడంతో పాటు క్రీడా ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పించనున్నారు. అన్ని కేడర్లలోని ఉపాధ్యాయుల మధ్య ఐక్యత, స్నేహాన్ని బలోపేతం చేయడం, ఆటలలో చురుకుగా పాల్గొనడంలో విద్యార్థులకు ఒక ఉదాహరణగా నిలిచి వారిని ప్రేరేపించడం ముఖ్య లక్ష్యాలుగా ఈ ఆటలు పోటీలు నిర్వహించనున్నారు. జిల్లాలో 36 మండలాలు, మూడు రెవెన్యూ డివిజన్లతో పాటు, జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి మండలానికి రూ.5వేల చొప్పున 36 మండలాలకు రూ.1.80లక్షలు, ప్రతి డివిజన్‌కు రూ.20వేల చొప్పున మూడు డివిజన్లకు రూ.60వేలు విడుదల చేయనున్నారు. జిల్లాస్థాయిలో పోటీలకు రూ.20వేలు నిర్వహణ బడ్జెట్ కూడా కేటాయించారు. దీనిపై ప్రత్యేక ఉత్తర్వులు విద్యాశాఖ విడుదల చేసింది.

మానసిక ఉల్లాసం కలిగించేందుకు



ఉపాధ్యాయులు అలసట నుంచి బయటకు వచ్చేందుకు ప్రభుత్వం ఒక మంచి కార్యక్రమాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయం. ఉపాధ్యాయులకు కూడా పోటీతత్వం అలాగే మానసిక ఉల్లాసం శరీర దృఢత్వానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుంది.

- ఎస్.షంషుద్దీన్, డీఈవో

పీఈటీలకు ప్రత్యేక పోటీలు నిర్వహించాలి



పీఈటీలను ప్రత్యేక జట్లుగా విభజించి పోటీలు నిర్వహించాలి. పీఈటీలను కూడా కలిపి పోటీలు నిర్వహించడం ద్వారా సాధారణ ఉపాధ్యాయులకు అన్యాయం జరిగే అవకాశం ఉంటుంది. పీఈటీలకు ప్రత్యేకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

పుష్పగిరి హుండీ లెక్కింపు

వల్లూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుష్పగిరి క్షేత్రంలో వెలసిన వైద్యనాథ లక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానం హుండీలను మంగళవారం లెక్కించినట్లు ఈవో శ్రీనివాసులు తెలిపారు. 6.5.2025 నుంచి 18.11.2025 వరకు హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.8,28,180లు వచ్చిందన్నారు. దేవదాయశాఖ కడప ఇన్‌స్పెక్టరు శివయ్య పర్యవేక్షణలో ఈ లెక్కింపు చేసినట్లు తెలిపారు. గతంలో కంటే రూ.2,16,718 అధికంగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ మొత్తాన్ని దేవస్థానానికి చెందిన బ్యాంకులో జమ చేస్తామని ఈవో తెలిపారు. ఈ కార్యక్రమంలో పురావస్తుశాఖ సిబ్బంది, పోలీసులు, స్థానిక అర్చకులు పాల్గొన్నారు.

పర్వతారోహణ క్యాంప్‌నకు కోటిరెడ్డి కళాశాల విద్యార్థుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష

కడప ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఫైనలియర్ విద్యార్థినులు సి.పావని, కె.జాహ్నవిలు మనాలిలో ఏబీవీఐఎమ్ ఏఎస్‌లో నవంబరు 22 నుంచి డిసెంబరు 1 వరకు జరిగే నేషనల్ అడ్వెంచర్ ట్రైనింగ్ క్యాంప్ (ఎన్‌ఏటీసీ)కి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సలీంబాష తెలిపారు. ఈ క్యాంప్‌లో పాల్గొనడం వలన నాయకత్వం, క్రమశిక్షణ, టీంవర్క్‌వంటి లక్షణాలు విద్యార్థుల్లో పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జి.విజయలక్ష్మి దేవి, డాక్టర్ పి.శశిదేవిలను ప్రిన్సిపాల్ అభినందించారు. యోగివేమన యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో మొత్తం పది మంది వలంటీర్లు ఈ అడ్వెంచర్‌క్యాంప్‌నకు ఎంపికయ్యారని, వీరితో కంటింజెంట్ లీడర్‌గా డాక్టర్ కె.లలిత హాజరవుతున్నారని తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



పెద్దిరెడ్డి (ఫైల్ ఫొటో)

సింహాద్రిపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిదినంచెర్ల గ్రామానికి చెందిన రైతు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెడ్ కానిస్టేబుల్ చంద్రమోహన్‌రెడ్డి సమాచారం మేరకు.. బిదినంచెర్ల గ్రామానికి చెందిన ముత్తులూరు పెద్దిరెడ్డి (47) తనకున్న 5 ఎకరాల పొలంలో చీనీ తోట సాగుచేసేవాడు. పంట సరిగా రాకపోవడం, సాగు చేసేందుకు సమారు రూ.20 లక్షల మేర అప్పులు కావడంతో మనస్తాపానికి గురైన పెద్దిరెడ్డి మంగళవారం గ్రామ సమీపాన గల చెరువు కట్టవద్ద విషగుళికలు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ప్రసన్నలక్ష్మి ఫిర్యాదు మేరకు సింహాద్రిపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మహిళ ఆత్మహత్య

సిద్దవటం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : టక్కోలిలో కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య చేసుకుంది. టక్కోలిలో నివశిస్తున్న దుంపల వాసంతి (25)కి నాలుగు నెలల కిందట ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అప్పటి నుంచి కడుపునొప్పితో బాధపడుతుండేది. ఈ బాధ తాళలేక సోమవారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని మృతి చెందింది. చిన్నారి ఏడుస్తుండగా కొంతమంది మహిళలు తలుపులు తెరవగా మృతి చెందినట్లు గుర్తించారు. మంగళవారం మృతురాలి అన్న వెంకటమాధవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన కోడూరు విద్యార్థులు

రైల్వేకోడూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఏపీ తైక్వాండో అసోషియేషన్ ఈనెల 15, 16 తేదీల్లో 39వ జూనియర్, 41వ సీనియర్ తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సీనియర్స్ విభాగంలో రైల్వేకోడూరుకు చెందిన ఎం.చైతన్య ప్రసాద్, జె.నాగమణి, బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా మంగళవారం రైల్వేకోడూరు యస్‌వీకే స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకుడు శివాజీ మాట్లాడుతూ సబ్-జూనియర్స్ విభాగంలో పి.నాగచరణ్, జి.అభిరాం సాయివర్మ, ఎ.రాంచరణ్, పి.శ్రీరాం, బాలికల విభాగంలో పి.హర్షిత, కె.నిహారికలు బంగారు పతకాలు, వరుణ్‌కుమార్, వర్షశ్రీ, సుమయ వెండి పతకాలు సాధించారని తెలిపారు. 8 మంది విద్యార్థులు ఈనెల 21 నుంచి 26 వరకు పంజాబ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అలాగే సీనియర్స్ విభాగంలో డిసెంబరులో జాతీయ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

నేటి నుంచి సత్యసాయిబాబా శతజయంతి

వేంపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయిబాబా శతజయంతి వేడుకలను వేంపల్లెలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్నట్లు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కుంచ సాయి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 19 నుంచి 23వ తేదీ వరకు పలుకార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

44 గ్యాస్ సిలిండర్లు సీజ్



పట్టుబడిన సిలిండర్లను చూపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ

వేంపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు నిర్వహించారు. హోటళ్లు, టీ షాపులు తదితరచోట్ల దాడులు చేసి 44 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. పులివెందుల ఎన్ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ సుధీర్ మంగళవారం తనిఖీలు చేశారు. గృహ అవసరాలకు ఉపయోగించాల్సిన సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్న దుకాణాల్లో తనిఖీలు చేసి పలు గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ద్వారా గ్యాస్ ఏజెన్సీలో అప్పగించారు. సబ్సిడీ సిలిండర్లను వాణిజ్య అవసరాలు ఉపయోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో వీఆర్వోలు పాల్గొన్నారు.

నిత్యపూజస్వామి హుండీ ఆదాయం రూ.1.67 లక్షలు

సిద్దవటం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నిత్యపూజస్వామి దేవస్థానంతో మంగళవారం హుండీలను లెక్కించగా రూ.1,67,396 ఆదాయం వచ్చిందని దేవదాయశాఖ కార్యనిర్వాహణ అధికారి శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ రాజంపేట ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీధర్, ఆలయ చైర్మన్ రాజేంద్రప్రసాద్, పాలకమండలి సభ్యులు శివారెడ్డి, పార్వతమ్మ, ఆలయ సిబ్బంది, వంతాటిపల్లె గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ జాతీయ టోర్నమెంట్‌కు పార్నపల్లె విద్యార్థి



లింగాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి బేస్‌బాల్ టోర్నమెంట్‌కు పార్నపల్లె ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి నాగచైతన్య ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు అర్జున్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి 16 వరకు రైల్వేకోడూరులో జరిగిన ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బేస్‌బాల్ టోర్నమెంట్‌లో అత్యంత ప్రతిభకనబరచడంతో 2026 జనవరి నెలలో జరిగే జాతీయస్థాయి బేస్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు తెలిపారు.

పంట మార్పిడితో భూమి సారవంతం

లక్కిరెడ్డిపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): పంట మార్పిడితో భూమి సారవంతం పెరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం దిన్నెపాడులో వేరుశనగ, కంది, ఉలవ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట మార్పిడి వలన నేలలోని పోషకాలు సమతుల్యం కావడంతో ఏ పంట సాగు చేసినా తెగుళ్లు ఆశించకుండా ఉంటాయన్నారు. అంతేగాకుండా దిగుబడులు పెరిగి పంట నాణ్యత వస్తుందన్నారు. జిల్లాలో ఈ రబీ సీజన్‌లో చాలా మంది ఉలవలు ఎక్కువ సాగు చేశారని, పంట ఆశాజనకంగా ఉందన్నారు. ప్రస్తుతం మండలంలో ప్రతి చెరువులో నీరు అందుబాటులో ఉందని రబీలో వేరుశనగతో పాటు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో రాజకుమారి, ఏపీసీఎన్‌ఎఫ్ రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి గంగనపల్లె పాఠశాల విద్యార్థులు

కడప స్పోర్ట్స్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గంగనపల్లె పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలలో భాగంగా మంగళవారం క్రీడా పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పెండ్లిమర్రి మండలం గంగనపల్లె పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరచి ఈనెల 22, 23, తేదీలలో పల్నాడు జిల్లా వినుకొండ లయోలా హైస్కూల్‌లో జరుగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైనట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి చంద్రావతి వెల్లడించారు.

క్రీడా పాఠశాలలో నిర్వహించిన అండర్-17 బాలికల హ్యామర్ త్రో విభాగంలో పావని అనే క్రీడాకారిణి ప్రథమ స్థానం సాధించగా ద్వితీయ స్థానాన్ని మహబూబ్‌జాన్ సాధించిందన్నారు., అలాగే బాలికల పోల్ వాల్ట్ పోటీలో సాహిదా ప్రథమ విజేతగా నిలువగా ద్వితీయ విజేతగా ముబీనా నిలిచి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

కాలువల ఆక్రమణలకు మార్కింగ్ ఇవ్వండి

● ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణంలోని ఐదు ప్రధాన కాలువలపై ఉన్న ఆక్రమణలను గుర్తించి మార్కింగ్ ఇవ్వాలని కాలువలకు అప్రోచ్ రోడ్డు వేసి ఎక్స్‌కవేటర్లతో మురుగును ఎప్పటికప్పుడు తొలగించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో ఆయన కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, మైనర్ ఇరిగేషన్ అధికారులు ఈఈ డీఈ ఏసీపీ, తహసీల్దార్‌లతో కలిసి కాలువ ఆక్రమణల తొలగింపు, రోడ్ల విస్తరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలువలు మరోసారి సర్వే పూర్తి చేసి వెంటనే మార్కింగ్ ఇవ్వాలన్నారు. రోడ్ల విస్తరణకు సంబంధించి ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కొర్రపాడు రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో వన్ టౌన్ సీఐ తిమ్మారెడ్డి ఇతర అధికారులు పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి : మంత్రి





యువతనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మదనపల్లెకు చెందిన విద్యార్థినులు చేస్తున్న నృత్యం

రామాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బండపల్లి పంచాయతీ పరిధిలోని భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జిల్లా జాతీయ యువజనోత్సవాలను కళాశాల చైర్మన్ మన్నూరు భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక యువజన శాతం కలిగినది మన దేశమని, వికసిత్ భారత్ 2047 దిశగా దేశాన్ని నడిపించే శక్తి యువత అని తెలిపారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ జాతీయ యువజనోత్సవాలు యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సృజనాత్మకతను పెంపొందించే వేదికగా నిలుస్తున్నాయని తెలిపారు. అనంతరం మంత్రిని కాలేజీ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నూరు భాస్కర్, స్టెప్ సీఈవో సుబ్బరాయుడు, బిట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏసీ రెడ్డి, త్రినై కాలేజీ ఫార్మా ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఏవో జలజ, అన్ని పాఠశాలల పీటీలు, పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిహారం కోసం ఎదురుచూపులేనా...!

● సీఎం సారూ.. స్పందించండి ● రూ.454 కోట్లకు జీవో ఇచ్చిన వైసీపీ సర్కారు ● పరిహారం మాత్రం ఇవ్వని వైనం ● గండికోట నిర్వాసితుల ఆవేదన



కొండాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గండికోట నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమయింది. రెండేళ్ల కిందట వైసీపీ సర్కారు పునరావాస పరిహారం కోసం జీవో విడుదల చేసినా, ఇంతవరకు పరిహారం అందకపోవడంతో నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కనికరించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

జీవో ఇచ్చి గాలికొదిలేసి..

గండికోట ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నీళ్ల తామే మొదటిసారిగా నింపినట్లు గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ ప్రభుత్వం.. నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో పూర్తిగా విఫలమయింది. ఎన్నికలకు తొమ్మిది నెలల ముందు 2023 జూలై 6న గండికోట నిర్వాసితుల పునరావాస పరిహారం కోసం రూ.454.6 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవో ఇచ్చింది. మొదటి విడత 14 ముంపుగ్రామాలకు అదనపు పరిహారం కింద ఒక్కొక్కరికి రూ.3,25,000 చొప్పున 9,096 మంది నిర్వాసితులకు గాను రూ.295.62 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవోలో ఉంది. అదేవిధంగా రెండో విడత 8 గ్రామాల్లో పెండింగ్ ఉన్న 573 మంది నిర్వాసితులకు రూ.59.3 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపింది. కొండాపురం పట్టణంలో సప్లిమెంటరీ జాబితా కింద 547 మంది నిర్వాసితులకు రూ.53.86 కోట్లు ఇస్తామంది. అదే విధంగా మొదటివిడత 14 ముంపు గ్రామాల్లో పూర్తిగా పరిహారం అందని నిర్వాసితులకు రూ.46.77 కోట్లు ఇవ్వనున్నట్లు జీవోలో తెలిపింది. మొత్తం 22 గ్రామాలకు పరిహారం కింద 18,204 నిర్వాసిత కుటుంబాలకు రూ.454.6 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవోలో తెలిపింది. ఈ జీవోకుకు సంబంధించి కనీసం ఒక్కరూపాయి కూడా పరిహారాన్ని నిర్వాసితులకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేసింది.

రెండేళ్లుగా ఎదురుచూపులు..

వైసీపీ సర్కారు జీవో విడుదల చేసి గాలికొదిలేయడంతో కూటమి ప్రభుత్వంపైనే నిర్వాసితులు ఆశలు పెట్టుకున్నారు. రెండేళ్లుగా పునరావాస పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. గత ఏడాది డిసెంబరు 22న మంత్రి నిమ్మల రామానాయుడు గండికోట ప్రాజెక్టును సందర్శించడంతో పరిహారంపై మరింత ఆశలు పెంచుకున్నారు. పరిహారం తొందరగా ఇచ్చేందుకు కృషిచేస్తామని మంత్రి చెప్పారు. ఆ తర్వాత జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డితో కలిసి విజయవాడలో నిర్వాసితులు మంత్రి నిమ్మలతో సమావేశమయ్యారు. బడ్జెట్‌లో కేటాయించిన రూ.150 కోట్ల నిధులతో పాటు, మిగిలిన పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా రూ.150 కోట్లను వెంట మంత్రి చెప్పారు. అయినప్పటికీ ఇంతవరకు పరిహారం అందకపోవడంతో నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ తీసుకుని వెంటనే పరిహారానికి సంబంధించిన నిధులు విడుదల చేయాలని గండికోట నిర్వాసితులు కోరుతున్నారు.

చెరువులకు హంద్రీనీవా నీరు మళ్లింపుపై చర్చలు



వడ్డిపల్లె వద్ద హంద్రీనీవా కాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష

మదనపల్లె టౌన్, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా జలాలను సీటీఎం, నిమ్మనపల్లె చెరువులకు మళ్లించేందుకు సాధ్యాసాధ్యాలపై ఎమ్మెల్యే షాజహాన్‌బాష అధికారులతో చర్చించారు. మంగళవారం స్థానిక హంద్రీనీవా కాల్వ వద్దకు హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులతో కలిసి వెళ్లిన ఎమ్మెల్యే హంద్రీనీవా కాల్వలో ప్రవాహ వేగం, వడ్డిపల్లె వద్ద హంద్రీనీవా కాల్వ ఇరువైపులా కట్ట బలహీనంగా వుందా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దివంగత ఎన్టీఆర్ ప్రారంభించిన హంద్రీనీవా ప్రాజెక్టును చంద్రబాబు పూర్తి చేయడం మదనపల్లె ప్రజలకు సంతృప్తి ఇస్తోందన్నారు. త్వరలో సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నిర్మాణాలను పూర్తి చేసి పట్టణ ప్రజలకు తాగునీరు అందించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం మహిళా సంఘాలతో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ పథకం కింద చిన్న, కుటీర పరిశ్రమల స్థాపనకు మహిళలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. తక్కువ వడ్డీతో అందిస్తున్న రుణాలతో పెట్టుబడులు పెట్టి మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. హంద్రీనీవా కాల్వకు దిగువన కొందరు ప్రభుత్వ స్థలం ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతుండగా గమనించిన ఎమ్మెల్యే సర్వేయర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను పిలిపించి సర్వే చేయించారు. ఆక్రమణలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.

రికార్డులు లేని స్థలాలకు స్వామిత్వ ద్వారా గుర్తింపు



గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పెద్దతిప్పసముద్రం నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నివసిస్తూ ఏళ్లగా తమ స్థలాలకు ఎటువంటి రికార్డులు లేని వారికి స్వామిత్వ సర్వేతో గుర్తింపు లభిస్తుందని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్వే మడుమూరులో దేవప్పకోట, మడుమూరు సర్పంచులు అనితా సురేష్, నాగరత్నమ్మ అధ్యక్షతన గ్రామసభలను నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గృహాలకు సరైన పత్రాలు, కొలతలు లేకపోవడంతో గ్రామాల్లో తరచూ ఇంటి స్థలాలు, గ్రామకంఠం భూముల కోసం గొడవలు పడడం, కోర్టుకు వెళ్లడం వంటివి జరుగుతుండడంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రభుత్వం కొత్తగా ఓ యాప్‌ను రూపొందించిందని, ఈయాప్ ద్వారా గ్రామకంఠం భూములు, స్థలాలను గుర్తించి, సచివాలయ సిబ్బంది ద్వారా పర్యవేక్షించి ప్రత్యేక నంబరును కేటాయించి ఆన్‌లైన్ చేసి వాటిని యాజమానులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ స్థలాలకు డిజిటల్ శాశ్వత పత్రాలను అందిస్తామన్నారు. ఆయా గ్రామాల్లో స్థలాల సమస్యలను తమ దృష్టికి తీసుకు వస్తే వాటిని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలను, గ్రామకంఠం భూములను ఆక్రమించినట్లు తేలితే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందన్నారు. కార్యదర్శి రమేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ నవీన్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ నాగార్జునలతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

చెరువునుంచి ఇసుక అక్రమతరలింపు



చెరువు నుంచి ఇసుక తరలిస్తున్న దృశ్యం

బి.కొత్తకోట, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలం సూరపువారిపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తఉడియం చెరువునుంచి ఇసుక అక్రమ రవాణా దర్జాగా సాగుతోంది. ఎక్స్‌వేటర్లతో చెరువు తవ్వి పక్కన డంప్ చేసి ట్రాక్టర్లతో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రిళ్లు సరిహద్దున ఉన్న కర్నాటక గ్రామానికి తరలించి, అక్కడి నుంచి చింతామణి, గౌనిపల్లి, బెంగళూరుకు సైతం తరలిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో పాటు ట్రాక్టర్‌లోడు ఇసుక 3000కు పైగా ధరకు విక్రయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఇసుక అక్రమ రవాణాపై సమాచారం ఉన్నప్పటికీ రెవెన్యూ, పోలీసు అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. దీనిని అడ్డుకోవాలని స్థానిక రైతులు ప్రయత్నించినా సాధ్యం కాలేదని సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జనగణనలో కులగణన చేపట్టాలి



ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాలు

పీలేరు, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జనగణనలో కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. జనగణన, కులగణన చేపట్టడం, అణగారిన వర్గాలపై దాడులు అరికట్టాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో పలు ప్రజాసంఘాలు ఆందోళన చేపట్టాయి. సీపీఐ నేతలు సాంబశివ, టీఎల్ వెంకటేశ్ మాట్లాడుతూ మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలోని దళితులు, మహిళలు, గిరిజనులు, మైనార్టీలపై దాడులు మితిమీరిపోయాయన్నారు. ఆర్‌ఎస్ ఎస్, సంఘ్ పరివార్ కనుసన్నల్లో భారత రాజ్యాంగ లౌకిక, ప్రజాస్వామ్య వ్యతిరేక పాలన సాగుతోందన్నారు. తెలంగాణలో చేపట్టిన విధంగా జనగణనలో కులగణన చేపట్టి కులాల ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో సీట్లు కేటాయించాలన్నారు.

కాల్వలు... రోడ్లు ఏవీ..?

జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు, వసతులు మరిచారు ● అవస్థల నడుమ నివాసాలు



వాల్మీకిపురంలోని జగనన్న కాలనీకి వెళ్లే దారి దుస్థితి

వాల్మీకిపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మురుగు పారేందుకు కాల్వలు లేవు, నడిచేందుకు సీసీ రోడ్లులేవు. ఇదెక్కడి జగనన్న కాలనీ అయ్యా అంటూ పలువురు వైసీపీ ప్రభుత్వంపై తిట్ల దండకం తీసుకుంటున్నారు. వైసీపీ పాలనలో వాల్మీకిపురంలో మంజూరైన జగనన్న కాలనీ సమస్యల నడుమ కొట్టుమిట్టాడుతోంది. 2020లో నవరత్నాలు పథకం ద్వారా నిరుపేదలైన 395మందికి నివాసాలు మంజూరు చేస్తూ కాలనీ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. అప్పటి నుంచి ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావడం అంతంత మాత్రమే. కొన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలు కూడా జరిగాయి. మరికొన్ని గోడలు, పునాదులు వివిధ స్థాయిల్లో నిలిచిపోయాయి. ఎట్టకేలకు ఇటీవల కొన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్నా జగనన్న కాలనీలో సౌకర్యాలు పూర్తి స్థాయిలో లేకపోవడంతో ప్రారంభానికి నోచుకోలేదు. కాలనీ ప్రాంతంలో సీసీ రోడ్లు, మురికినీటి కాల్వల నిర్మాణాలు ఇప్పటి దాకా చేపట్టకపోవడం గమనార్హం. ఏళ్ల తరబడి ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాక పోగా సౌకర్యాల కల్పనలో కూడా అడుగులు అంతంత మాత్రంగానే పడుతుండడం గమనార్హం. అభివృద్ధికి నోచుకోని జగనన్న కాలనీ నివాసాల నడుమ పిచ్చిమొక్కలు పెరిగిపోయి గుంతల మయమవడం, అటవీ ప్రాంతంలో ఉన్నామా అన్నట్టుగా పరిస్థితులు తయారవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొప్పగా శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిపి వదిలే శారే తప్ప కాలనీ సమస్యల పరిష్కారం అభివృద్ధి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వ ప్రజాప్రతినిధులు, అధికారులు జగనన్న కాలనీపై దృష్టి సారిస్తే సంతోషిస్తామని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా జగనన్న కాలనీలో ఉన్న అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలకు కూడా కనీసం రోడ్డు కరవైంది.

సమస్యలు గుర్తించాం



జగనన్న కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం తదితర సమస్యలన్నింటినీ ఇదివరకే గుర్తించి నివేదికలను సిద్ధం చేశాము. ప్రతిపాదనలు కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాము. కాలనీ ప్రాంతంలో అభివృద్ధి పనులు మంజూరైన తక్షణం సమస్యల పరిష్కారం మౌలిక వసతుల కల్పన సమగ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటాము.

మనోహర్‌రాజు, ఎంపీడీఓ, వాల్మీకిపురం





అసౌకర్యాల కారణంగా ప్రారంభానికి నోచుకోని నివాసాలు - జగనన్న కాలనీ ప్రాంతంలో అంబేడ్కర్ గురుకుల పాఠశాల రోడ్డు దుస్థితి

విద్యుత్ అదనపు లోడు చెల్లించాలి

తంబళ్లపల్లె, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): తక్కువ లోడుతో విద్యుత్ కనెక్షన్ తీసుకుని, అధికంగా విద్యుత్ వాడే వినియోగదారులు అదనపు లోడును తప్పక చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని విద్యుత్ ఏఈలు సురేంద్ర, శేషకుమార్ సూచించారు. మంగళవారం విద్యుత్ అధికారులు ఆరు బృందాలుగా ఏర్పడి తంబళ్లపల్లె, కుక్కరాజుపల్లె, కోసువారిపల్లె, పంచాలమర్రి, గుండ్లపల్లె, గోపిదిన్నెలో లోడ్ రెగ్యులరైజేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. తక్కువ లోడుతో విద్యుత్ కనెక్షన్ తీసుకుని, గీజర్లు, ఏసీలు, మోటార్లు, హీటర్లు ఉపయోగిస్తూ అధిక విద్యుత్‌ను వినియోగిస్తున్న వారి గృహాలను పరిశీలించారు. మండలంలో 56 మంది వినియోగదారుల నుంచి రూ.1.49 వేలు అదనపు లోడు కట్టించినట్లు తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో ఎల్‌ఐలు భాస్కర, నాగరాజు లైన్‌మెన్లు, ఈఆర్వో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దళితుల భూముల జోలికొస్తే ఉద్యమాలకు సిద్ధం

● మాల మహానాడు నేతల హెచ్చరిక

కలికిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): దళితుల భూముల జోలికి వస్తే న్యాయం జరిగే వరకూ ఉద్యమాలకు సిద్ధమని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు యమలా సుదర్శనం హెచ్చరించారు. మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి హరి, తదితరులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మండలంలో దళితుల భూములను అక్రమంగా చేజిక్కించుకుని సొమ్ము చేసుకున్నారిన ఆరోపించారు. ఈ భూములను దళితులకు అప్పగించకుంటే పోరాటానికి సమాయత్తమవుతామని హెచ్చరించారు. త్వరలోనే ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డిని కలిసి దళితుల భూముల విషయంలో జరిగిన అక్రమాలపై న్యాయం చేయాలని కోరనున్నట్లు వెల్లడించారు. దళితులకు న్యాయం చేసేందుకు దేనికైనా వెనుకాడే ప్రసక్తే లేదని కూడా స్పష్టం చేశారు. మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి వై.చంద్ర, రాష్ట్ర అధికార ప్రతినిధి హరి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండా మనోహర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెల మోహన పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ధర్నా



ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

ములకలచెరువు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం సీపీఐ నేతలు ధర్నా చేపట్టారు. సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప మాట్లాడుతూ సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం దళిత, గిరిజన, మైనార్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. జనగణనలో కుల గణన చేపట్టాలన్నారు. దేశంలో సామాజిక న్యాయం, సమానత్వ సాధన, ఆత్మగౌరవం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు నిజాముద్దీన్, ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి

నిమ్మనపల్లి, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు దేవాలయాల్లో నిర్మిస్తున్న మరుగదొడ్లు స్నానపుగదుల నిర్మాణాలను త్వరతగతిన పూర్తి చేయాలని ఏఈ మిధున్ చక్రవర్తి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తవళం పంచాయతీ అటవీ ప్రాంతంలోని శ్రీనేలమల్లేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం రూ.6లక్షలతో మరుగుదొడ్లు స్నానపుగదులు, సయ్యద్‌షావలి కట్ట వద్ద రూ.6లక్షలతో మరుగుదొడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 60శాతానికి పైగా పనులు పూర్తి అయ్యాయని మిగిలిన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

ఘనంగా లక్ష్మీకామేశ్వర ఆలయ వార్షికోత్సవాలు



విశేష అలంకరణలో కామేశ్వరస్వామి - హోమం నిర్వహిస్తున్న అర్చకులు

వాల్మీకిపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటివీధిలో వెలసిన శివాలయం ప్రతిష్ఠ జరిగి 24ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం వార్షికోత్సవం నిర్వహించారు. ఉదయం సుప్రభాతం మొదలు మహన్యాస పూర్వక ఏకాదశ వార రుద్రాభిషేకాలు, పంచామృత హరిద్ర, పద్మాభిషేకాలు, మహా గణపతి, రుద్ర, దుర్గా సూక్త, మహామణ్యు, పరివార దేవతల, నవగ్రహ దేవతల మూల మంత్రాలతో యాగాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీకామేశ్వరస్వామి, దేవతామూర్తులకు విశేషాలంకరణలతో పూజలు జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్త కువైత్ శంకరాచారి, గోనవరపు శీనాస్వామి అర్చక బృందం, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'లెప్రసీ'పై అపోహలు వీడాలి



ముత్తరాశి వీధిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ, వైద్యాధికారి

పీలేరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): లెప్రసీ వ్యాధిపై అపోహలు వీడి దాని గురించి ధైర్యంగా మాట్లాడాలని పీలేరు ఎంపీడీఓ శివశంకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముత్తరాశి వీధిలో జరుగుతున్న లెప్రసీ సర్వేను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ గతంలో మాదిరి లెప్రసీ గూర్చి భయపడాల్సిన పని లేదని, ప్రభుత్వం అందించే ఉచిత వైద్య చికిత్సతో దానిని పూర్తిగా నయం చేయవచ్చన్నారు. లెప్రసీ సర్వేను పూర్తి పారదర్శకంగా చేపట్టాలని వైద్య ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైద్యాధికారి చంద్రశేఖర్ నాయక్, ఏఎన్‌ఎం ధనంజయమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ ఆయిసా, ఆశా కార్యకర్తలు సంధ్య, ధనలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి



సమీక్షిస్తున్న డీఆర్వో

పీలేరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోపు పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) సత్యనారాయణ ఆదేశించారు. పీజీఆర్‌ఎస్ అర్జీలపై మంగళవారం పీలేరు తహసీల్దారు కార్యాలయంలో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ పీజీఆర్‌ఎస్‌లో పీలేరు మండలం నుంచి 116 అర్జీలు వచ్చాయని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వాటిని పరిష్కరించాలన్నారు. ఓటరు జాబితా సవరణ నియోజకవర్గంలో చాలా నెమ్మదిగా సాగుతోందని, వేగం పెంచాలన్నారు. తహసీల్దారు శివకుమార్, డీటీ ప్రసాద్, ఆర్‌ఐ మురగయ్య, ఏఎస్‌వో రెడ్డప్ప నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

ములకలచెరువు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సెక్షన్ కార్యాలయంలో గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ జరుగుతుందని ట్రాన్స్‌కో కార్యనిర్వాహక ఇంజనీరు గంగాధరం, ఏఈ శేషు తెలిపారు. వినియోగదారుల సమస్యల పరిష్కారానికి అదాలత్ నిర్వహిస్తున్నామని చెప్పారు. వినియోగదారులు సద్విని యోగం చేసుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకం



వాల్మీకిపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణ పడమర పొలిమేరల్లోని ధర్మపథం సమూహాలయంలో మంగళవారం షిరిడీసాయి సాలిగ్రామ తిరునారాయణ ధార్మిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. ఉదయం సుప్రభాత సేవ, సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు, అలంకరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీ, అన్నదానం జరిగాయి.

రేపు అన్నాభిషేకం

ధర్మపథం ఆలయంలో గురువారం కార్తీక అమావాస్య సందర్భంగా హరిహర బ్రహ్మాత్మక లింగోద్భవ మహావుడికి ఏకవార, సప్తధాతు రుద్రాభిషేకం, అన్నాభిషేకం, విశేష పూజలు నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు పేర్కొన్నారు. భక్తులు హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలన్నారు.

విద్యార్థుల పెంపునకు కృషి చేయాలి : ఆర్‌జేడీ

కలకడ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): పాఠశాలలో విద్యార్థుల పెంపు కోసం కృషి చేయాలని కడప ఆర్జేడీ శామ్యూల్ ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం ఆయన కదిరాయచెరువు జడ్పీ హైస్కూల్‌ను సందర్శించి ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు సూచనలిచ్చారు. ఎఫ్‌ఏ-1,2 పరీక్ష మార్కుల నమోదు, తరగతి గదులు, మరుగుదొడ్ల సంఖ్యపై ఆరా తీశారు. హెచ్‌ఎం సాకే శ్రీనివాసులు, ఉపాధ్యాయుడు జె. శ్రీనివాసులు వెంట వున్నారు.

నేతల మృతికి సంతాపం



నరసింహులు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నల్లారి

గుర్రంకొండ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో మృతి చెందిన టీడీపీ నేతల కుటుంబాలను మంగళవారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి పరామర్శించి సంతాపం తెలిపారు. తరిగొండ, అరిగెలవారిపల్లె, ఎం.కొత్తపల్లె గ్రామాల్లో టీడీపీ నేతలు వాసుదేవయ్య, నరసింహులు మృతి చెందారు. వారి భౌతికకాయాలకు ఎమ్మెల్యే నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. టీడీపీ నేతలు, కార్యకర్తపాల్గొన్నారు.

సమానత్వం కోసం సీపీఐ నిరసన

బి.కొత్తకోట, నవంబరు18(ఆంధ్రజ్యోతి): దేశంలో బీసీలకు న్యాయం జరిగేలా సామాజికన్యాయం, సమానత్వాన్ని పాటించాలని, దళిత, గిరిజన, మైనారిటీలపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ మండల సీపీఐ నేతలు జ్యోతి చౌక్‌లో నిరసన చేపట్టారు. దేశంలో మతోన్మాద పాలన సాగుతోందని నిమ్న జాతులను అణిచివేయడమే అజెండాగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. జనగణనలో కులగణన చేపట్టి కులాల ప్రాతిపదికన స్థానిక ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు న్యాయం జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వీరికి బాస్ నేతలు సంఘీభావం ప్రకటించి నిరసనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు మనోహర్‌రెడ్డి, బషీర్ పాల్గొన్నారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి



తంబళ్లపల్లెలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం
కలకడలో పోటీ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

వాల్మీకిపురం, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి పోటీతత్వం అలవర్చుకోవడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని వాల్మీకిపురం గ్రంథాలయ అధికారి పసుపులేటి రమాపతి పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు వారోత్సవాల ముగింపు రోజు బహుమతులు ప్రధానం ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణానికి....

తంబళ్లపల్లె, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): సమున్నత సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలే చక్కటి మార్గాన్ని నిర్దేశిస్తాయని తంబళ్లపల్లె ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం మొగిలీశ్వరయ్య అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థులకు ఆటలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి జిలానీ బాష హెచ్‌ఎం విజయ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోటీపరీక్షల్లో ప్రతిభ చూపాలి

కలకడ, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి శ్రద్ధగా చదివి పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపాలని బాటవారిపల్లి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వెంకటసుబ్బయ్య అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా హెచ్‌ఎం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ తదితర పరీక్షలు నిర్వహించారు. లైబ్రేరియన్ అమర్‌నాథ్, ఉపాధ్యాయులు రాజగోపాల్, బాబురెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆటలు

● మండలస్థాయిలో 29, 30 తేదీలలో ● డివిజన్ స్థాయి డిసెంబరు 13, 14 తేదీలలో...
● జిల్లాలో 8,482 మందికి పైగా ఉపాధ్యాయులు ● సన్నాహాలు చేస్తున్న పాఠశాల విద్యాశాఖ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో నైపుణ్యాలు గుర్తించి ప్రోత్సహించి భావిపౌరులుగా తీర్చిదిద్దడంలో కీలక భూమిక పోషించే ఉపాధ్యాయుల్లో మానసిక ఒత్తిడిని దూరం చేసేలా, మరింత ఉత్సాహంగా బోధన చేసేలా శారీరక, మానసిక సామర్థ్యం పెరిగేలా ప్రభుత్వం ఆటలపోటీలు నిర్వహించేందుకు సిద్ధమైంది. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఆటల పోటీల నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఈనెల 16వ తేదీన ఆదేశాలు జారీ చేశారు.

కడప జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపాలిటీ, ఎయిడెడ్ పాఠశాలలో దాదాపు 8,482 మందికి పైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఉపాధ్యాయుల్లో కూడా అంతర్లీనంగా ఉన్న క్రీడానైపుణ్యాలను వెలికితీసేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. పురుష టీచర్లకు క్రికెట్, మహిళ టీచర్లకు త్రోబాల్ తదితర పోటీలు నిర్వహించనున్నారు. తొలుత మండల స్థాయి తర్వాత డివిజన్‌స్థాయిలో నిర్వహించనున్నారు. డివిజన్ స్థాయిలో నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ బాధ్యతలను మండలస్థాయిలో స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌కు అప్పగించారు.

మండల స్థాయిలో ఎంఈఓ 1, 2 నిర్వహణ అధికారులుగా వ్యవహరిస్తారు. డివిజన్ స్థాయిలో డిప్యూటీ డీఈఓ, జిల్లాస్థాయిలో డీఈఓ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి సమన్వయకర్తలుగా ఉంటారు. రాష్ట్రస్థాయిలో పోటీలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రకార్యదర్శి జేడీ స్థాయిలో అధికారి బాధ్యతలు తీసుకుంటారు. పోటీలకు తొలుత మండలస్థాయి జట్లను ఎంపిక చేస్తారు. ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలకు సంబంధించి ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుడు ముగ్గురు, పాఠశాల సహాయకులు, నాన్ లాంగ్వేజ్ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్, పీఈటీలు, ఏడుగురు ఎస్‌జీటీల సహా మొత్తం 16 మందితో కమిటీ ఏర్పాటుచేస్తారు. అదేవిధంగా త్రోబాల్ ఇతర క్రీడలకు ప్రత్యేకంగా జట్లను ఎంపిక నిర్వహిస్తారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి డీఈఓలకు ఆదేశాలు జారీ అయ్యాయి.

ఆటలపోటీల వివరాలు

మండలస్థాయిలో ఈనెల 29, 30 తేదీలలో నిర్వహించనున్నారు. డివిజన్ స్థాయిలో డిసెంబరు 13, 14 తేదీలలో, జిల్లాస్థాయిలో డిసెంబరు 20, 21, 22 తేదీలలో రాష్ట్రస్థాయిలో జనవరి 2, 3, 4 తేదీలలో నిర్వహిస్తారు. ఈ ఆటల ద్వారా ఉపాధ్యాయులలో శారీరక దృఢత్వం, ఆరోగ్యం పెంపొందించి ఒత్తిడిని తగ్గించడం, జట్టు స్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, వినోద కార్యక్రమాలకు వేదికను అందించడంతో పాటు క్రీడా ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పించనున్నారు. అన్ని కేడర్లలోని ఉపాధ్యాయుల మధ్య ఐక్యత, స్నేహాన్ని బలోపేతం చేయడం, ఆటలలో చురుకుగా పాల్గొనడంలో విద్యార్థులకు ఒక ఉదాహరణగా నిలిచి వారిని ప్రేరేపించడం ముఖ్య లక్ష్యాలుగా ఈ ఆటలు పోటీలు నిర్వహించనున్నారు. జిల్లాలో 36 మండలాలు, మూడు రెవెన్యూ డివిజన్లతో పాటు, జిల్లా కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి మండలానికి రూ.5వేల చొప్పున 36 మండలాలకు రూ.1.80లక్షలు, ప్రతి డివిజన్‌కు రూ.20వేల చొప్పున మూడు డివిజన్లకు రూ.60వేలు విడుదల చేయనున్నారు. జిల్లాస్థాయిలో పోటీలకు రూ.20వేలు నిర్వహణ బడ్జెట్ కూడా కేటాయించారు. దీనిపై ప్రత్యేక ఉత్తర్వులు విద్యాశాఖ విడుదల చేసింది.

మానసిక ఉల్లాసం కలిగించేందుకు



ఉపాధ్యాయులు అలసట నుంచి బయటకు వచ్చేందుకు ప్రభుత్వం ఒక మంచి కార్యక్రమాన్ని ఏర్పాటుచేయడం అభినందనీయం. ఉపాధ్యాయులకు కూడా పోటీతత్వం అలాగే మానసిక ఉల్లాసం శరీర దృఢత్వానికి ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుంది.
- ఎస్.షంషుద్దీన్, డీఈవో

పీఈటీలకు ప్రత్యేక పోటీలు నిర్వహించాలి



పీఈటీలను ప్రత్యేక జట్టుగా విభజించి పోటీలు నిర్వహించాలి. పీఈటీలను కూడా కలిపి పోటీలు నిర్వహించడం ద్వారా సాధారణ ఉపాధ్యాయులకు అన్యాయం జరిగే అవకాశం ఉంటుంది. పీఈటీలకు ప్రత్యేకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.
- సీవీ ప్రసాద్, ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు

కార్యకర్తలకు అండగా ఉంటాం

మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్



కార్యకర్తలతో మాట్లాడుతున్న దొమ్మలపాటి రమేశ్

రామసముద్రం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతలు, కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ తెలిపారు. బలిజపల్లె టీడీపీ నేత, రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గ కోశాధికారి సీతప్ప తండ్రి వెంకటరమణపై బుధవారం రాత్రి కొందరు దాడి చేసి తీవ్రంగా గాయపరిచి, పశువుల పాకను కూల్చివేశారు. ఈ విషయంలో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఎస్ఐను కోరారు. అనంతరం బలిజపల్లెకు వెళ్లి దుండగులు కూల్చివేసిన పశువుల పాకను పరిశీలించారు. కేసు విషయమై పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని, అధైర్యపడొద్దని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడు, మాజీ అధ్యక్షుడు కొండూరు నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ రెడ్డిశేఖర్, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనాథ్, బద్రినాథ్, చెంగారెడ్డి, బండ్ల జనార్దన, జావీద్, చిన్నాస్వామి, ఏపీ మోడల్ స్కూల్ చైర్మన్ బాలాజి, మొహ్మద్, వేణుగోపాల్ అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

సిప్ అబాకస్ జాతీయ రన్నరప్ రబీహా అంజుమ్



పీలేరు, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): చెన్నైలో ఆదివారం జరిగిన సిప్ అబాకర్ జాతీయ, అంతర్జాతీయ ప్రాడిజీలో పీలేరు చిన్నారి రబీ హా అంజుమ్ జాతీయ రన్నరప్‌గా నిలిచింది. చెన్నైలో జరిగిన ప్రాడిజీలో దేశంలోని పలు రాష్ట్రాలు, పలు దేశాలకు చెందిన 5870 మం ది చిన్నారులు పోటీపడగా పీలేరు నుంచి 21 మంది పాల్గొన్నారని పీలేరు సిప్ అబాకర్ బ్రాంచ్ అధినేత దినేశ్ తెలిపారు. వారిలో రబీ హా అంజుమ్ జాతీయ రన్నరప్‌గా నిలిచిందన్నారు. అంతేకాకుండా తమ బ్రాంచ్‌కు చెందిన హర్షిత్ రెడ్డి, అభినవ్ నంద, ఆఫియ, రోహిత్, మోక్షిత్ రెడ్డి, ముధిత్ సాయి, అబ్దుల్ బాసిత్, జయశ్యాం, మోక్షిత, సుమియ, చేతన సాయి, కృష్ణార్జున, హిమేశ్, మహిధర్, అయాన్ అనే విద్యార్థులు రాష్ట్ర స్థాయి రన్నరప్స్‌గా నిలిచారని తెలిపారు. జాతీయ రన్నరప్‌గా నిలిచిన రబీహా అంజుమ్‌కు సిప్ అబాకస్ సంస్థ సీఈవో దినేశ్ విక్టర్ ట్రోఫీ అందజేశారని ఆయన వివరించారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపొద్దు



అధికారులతో సమీక్షిస్తున్న డీఆర్‌వో మధుసూదనరావు

వాల్మీకిపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చేయరాదని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు ఆదేశించారు. మంగళవారం వాల్మీకిపురం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి అధికారులతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఐఆర్ 2026 కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న 2022 ఓటర్ల జాబితాతో 2025 జాబితా మ్యాపింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రెండు, మూడో విడత భూముల రీసర్వే నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని, ఆన్‌లైన్‌లో రికార్డుల నిర్వహణ సమర్థవంతంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రవినాయక్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుగుణ, సర్వేయర్ పూర్ణచంద్ర, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

44 గ్యాస్ సిలిండర్లు సీజ్



పట్టుబడిన సిలిండర్లను చూపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ

వేంపల్లె, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు నిర్వహించారు. హోటళ్లు, టీ షాప్‌లు తదితరచోట్ల దాడులు చేసి 44 గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. పులివెందుల ఎన్ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ సుధీర్ మంగళవారం తనిఖీలు చేశారు. గృహ అవసరాలకు ఉపయోగించాల్సిన సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్న దుకాణాల్లో తనిఖీలు చేసి పలు గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది ద్వారా గ్యాస్ ఏజెన్సీలో అప్పగించారు. సబ్సిడీ సిలిండర్లను వాణిజ్య అవసరాలు ఉపయోగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో వీఆర్వోలు పాల్గొన్నారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి



యూనియన్ నేతలతో మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్

తంబళ్లపల్లె, నవంబరు 18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం ఐఆర్ తక్షణమే ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో సభ్యత్వ నమోదు, సమస్యల సేకరణలో భాగంగా మంగళవారం ఎంఆర్సీ కార్యాలయంలో ఎస్టీయూ నేతలతో ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పే రివిజన్ కమిటీని ఏర్పాటు చేసి వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళి, నేతలు జనార్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రెడ్డప్ప రెడ్డి, సాంబశివ, మండల అధ్యక్షులు రమేష్‌రెడ్డి, ఎసానుల్లా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రమేశ్‌రెడ్డి

రామసముద్రం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ రమేష్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. గతంలో మంజూరైన ఇళ్లు, వాటి నిర్మాణాలు స్థితి, కొత్త దరఖాస్తులపై ఆరా తీశారు. ఇందులో గతంలో 2070 ఇళ్లు మంజూరు కాగా అవి వివిధ దశల్లో ఉన్నాయని, కొత్తగా 1090 దరఖాస్తులు వచ్చినట్లు సిబ్బంది పీడీకి వివరించారు. ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల స్థల పరిశీలన త్వరగా పూర్తిగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులతో ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న వారందరికీ ఇళ్లు మంజూరు చేస్తామని, ఇందుకు సంబంధించి ఈనెలాఖరు వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయంపై ఇంకా స్పష్టత లేదని ఇళ్ల లబ్ధిదారులు అడిగిన ప్రశ్నకు పీడీ సమాధానం ఇచ్చారు.

యూట్యూబర్‌కు ఉర్దూ అకాడమీ అవార్డు



కిశోర్‌కుమార్ రెడ్డి నుంచి అవార్డు స్వీకరిస్తున్న బావాజాన్

కలికిరి, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉర్దూ సాహిత్యంపై ఆలోచనాత్మక సజీవ కథనం రాసినందుకు ఉర్దూ అకాడమీ ఉత్తమ రచయితగా ఎంపికైన గుర్రంకొండ మండలం మర్రిపాడు వాసి పీజీ విద్యావంతుడైన అత్తర్ బావాజాన్‌కు ఉర్దూ అకాడమీ నుంచి రాష్ట్ర స్థాయి పురస్కారం సాధించాడు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉర్దూ అకాడమీ సృజనాత్మక కథనాలపై గత మంగళవారం నిర్వహించిన పోటీల్లో పాల్గొన్న ఆయన రాష్ట్ర స్థాయి అవార్డు కైవశం చేసుకున్నాడు. 'మొబైల్ ఫోన్‌తో లాభాలు, నష్టాలు.. సమాజంపై ప్రభావం' అనే అంశంపై ఆలోచనాత్మక సజీవ కథనం రాసినందుకు అకాడమీ ఉత్తమ రచనగా ఎంపిక చేసింది. ఈ కథ నేటి యువతరం సులభంగా అర్థం చేసుకునే రీతిలో ప్రభావవంతమైన శైలితో చక్కగా ప్రెజెంట్ చేసినట్లు అకాడమీ పేర్కొంది. బావాజాన్ సాహిత్య ప్రతిభకు, సృజనాత్మకతను గుర్తించి రాష్ట్ర స్థాయి అవార్డు అందించినందుకు అకాడమీ డైరెక్టర్ మహ్మద్ గౌస్‌పీర్ ప్రశంసించారు. అకాడమీ తరఫున ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి మంగళవారం రాత్రి నగరిపల్లెలో బావాజాన్‌కు అవార్డును అందజేశారు. అవార్డు గ్రహీత బావాజాన్‌తోపాటు మండల టీడీపీ నాయకులు జయసూరి, సయ్యద్‌షావలి, నాగేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

నిత్యపూజస్వామి హుండీ ఆదాయం రూ.1.67 లక్షలు

సిద్దవటం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి) : నిత్యపూజస్వామి దేవస్థానంతో మంగళవారం హుండీలను లెక్కించగా రూ.1,67,396 ఆదాయం వచ్చిందని దేవదాయశాఖ కార్యనిర్వాహణ అధికారి శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ రాజంపేట ఇన్‌స్పెక్టర్ జనార్దన్, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీధర్, ఆలయ చైర్మన్ రాజేంద్రప్రసాద్, పాలకమండలి సభ్యులు శివారెడ్డి, పార్వతమ్మ, ఆలయ సిబ్బంది, వంతాటిపల్లె గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ జాతీయ టోర్నీకి నాగచైతన్య



లింగాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి బేస్‌బాల్ టోర్నమెంట్‌కు పార్నపల్లె విద్యార్థి నాగచైతన్య ఎంపికయ్యాడని ప్రధానోపాధ్యాయుడు అర్జున్‌రెడ్డి తెలిపారు. ఈనెల 14 నుంచి 16 వరకు రైల్వేకోడూరులో జరిగిన ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 బేస్‌బాల్ టోర్నమెంట్‌లో అత్యంత ప్రతిభ కనబరచడంతో 2026 జనవరిలో జరిగే జాతీయ స్థాయి బేస్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

సిద్దవటం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): టక్కోలిలో కడుపునొప్పి తాళలేక దుంపల వాసంతి (25) ఆత్మహత్య చేసుకుంది. టక్కోలిలో నివశిస్తున్న వాసంతికి నాలుగు నెలల కిందట ఆడబిడ్డ పుట్టింది. అప్పటి నుంచి కడుపునొప్పితో బాధపడుతుండేది. ఈ బాధ తాళలేక సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకునింది. చిన్నారి ఏడుస్తుండగా కొందరు మహిళలు తలుపులు తెరవగా మృతి చెందినట్లు గుర్తించారు. మంగళవారం మృతురాలి అన్న వెంకటమాధవరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువత క్రీడల్లో రాణించాలి : మంత్రి




యువతనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, మదనపల్లెకు చెందిన విద్యార్థినులు చేస్తున్న నృత్యం

రామాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. బండపల్లి పంచాయతీ పరిధిలోని భాస్కర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం జిల్లా జాతీయ యువజనోత్సవాలను కళాశాల చైర్మన్ మన్నూరు భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధిక యువజన శాతం కలిగినది మన దేశమని, వికసిత్ భారత్ 2047 దిశగా దేశాన్ని నడిపించే శక్తి యువత అని తెలిపారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఈ జాతీయ యువజనోత్సవాలు యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సృజనాత్మకతను పెంపొందించే వేదికగా నిలుస్తున్నాయని తెలిపారు. అనంతరం మంత్రిని కాలేజీ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మన్నూరు భాస్కర్, స్టెప్ సీఈవో సుబ్బరాయుడు, బిట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఏసీ రెడ్డి, త్రినై కాలేజీ ఫార్మా ప్రిన్సిపాల్ నాగేంద్ర, ఏవో జలజ, అన్ని పాఠశాలల పీటీలు, పీడీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిహారం కోసం ఎదురుచూపులేనా...!

● సీఎం సారూ.. స్పందించండి ● రూ.454 కోట్లకు జీవో ఇచ్చిన వైసీపీ సర్కారు
● పరిహారం మాత్రం ఇవ్వని వైనం ● గండికోట నిర్వాసితుల ఆవేదన



కొండాపురం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): గండికోట నిర్వాసితుల సమస్యలను పరిష్కరించడంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమయింది. రెండేళ్ల కిందట వైసీపీ సర్కారు పునరావాస పరిహారం కోసం జీవో విడుదల చేసినా, ఇంతవరకు పరిహారం అందకపోవడంతో నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కనికరించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

జీవో ఇచ్చి గాలికొదిలేసి..

గండికోట ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో నీళ్లు తామే మొదటిసారిగా నింపినట్లు గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ ప్రభుత్వం.. నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో పూర్తిగా విఫలమయింది. ఎన్నికలకు తొమ్మిది నెలల ముందు 2023 జూలై 6న గండికోట నిర్వాసితుల పునరావాస పరిహారం కోసం రూ.454.6 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవో ఇచ్చింది. మొదటి విడత 14 ముంపుగ్రామాలకు అదనపు పరిహారం కింద ఒక్కొక్కరికి రూ.3,25,000 చొప్పున 9,096 మంది నిర్వాసితులకు గాను రూ.295.62 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవోలో ఉంది. అదేవిధంగా రెండో విడత 8 గ్రామాల్లో పెండింగ్ ఉన్న 573 మంది నిర్వాసితులకు రూ.59.3 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపింది. కొండాపురం పట్టణంలో సప్లిమెంటరీ జాబితా కింద 547 మంది నిర్వాసితులకు రూ.53.86 కోట్లు ఇస్తామంది. అదే విధంగా మొదటివిడత 14 ముంపు గ్రామాల్లో పూర్తిగా పరిహారం అందని నిర్వాసితులకు రూ.46.77 కోట్లు ఇవ్వనున్నట్లు జీవోలో తెలిపింది. మొత్తం 22 గ్రామాలకు పరిహారం కింద 18,204 నిర్వాసిత కుటుంబాలకు రూ.454.6 కోట్లు విడుదల చేయనున్నట్లు జీవోలో తెలిపింది. ఈ జీవోకుకు సంబంధించి కనీసం ఒక్కరూపాయి కూడా పరిహారాన్ని నిర్వాసితులకు ఇవ్వకుండా వైసీపీ ప్రభుత్వం చేతులెత్తేసింది.

రెండేళ్లుగా ఎదురుచూపులు..

వైసీపీ సర్కారు జీవో విడుదల చేసి గాలికొదిలేయడంతో కూటమి ప్రభుత్వంపైనే నిర్వాసితులు ఆశలు పెట్టుకున్నారు. రెండేళ్లుగా పునరావాస పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. గత ఏడాది డిసెంబరు 22న మంత్రి నిమ్మల రామానాయుడు గండికోట ప్రాజెక్టును సందర్శించడంతో పరిహారంపై మరింత ఆశలు పెంచుకున్నారు. పరిహారం తొందరగా ఇచ్చేందుకు కృషిచేస్తామని మంత్రి చెప్పారు. ఆ తర్వాత జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డితో కలిసి విజయవాడలో నిర్వాసితులు మంత్రి నిమ్మలతో సమావేశమయ్యారు. బడ్జెట్‌లో కేటాయించిన రూ.150 కోట్ల నిధులతో పాటు, మిగిలిన పరిహారాన్ని వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా రూ.150 కోట్లను వెంట మంత్రి చెప్పారు. అయినప్పటికీ ఇంతవరకు పరిహారం అందకపోవడంతో నిర్వాసితులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ తీసుకుని వెంటనే పరిహారానికి సంబంధించిన నిధులు విడుదల చేయాలని గండికోట నిర్వాసితులు కోరుతున్నారు.